క్లుప్తంగా

9న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న ఎన్‌టీఆర్ గానామృతం పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాంజలి వ్యవస్థాపక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు ఎన్‌టీఆర్ సినిమాలోని పాటల్ని ఆలపిస్తారని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లోని ప్రముఖులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

సీనియర్ న్యాయవాది పాండురంగ మృతి



గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఇబ్బూరి పాండురంగ శుక్రవారం ఉదయం మృతి చెందారు. నగరంలోని రామిరెడ్డినగర్‌లో నివాసం ఉండే ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాండురంగ మృతికి పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం తెలిపారు.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సంతాపం

పట్నంబజారు: కార్మిక నాయకుడు, న్యాయవాది ఇబ్బూరి పాండురంగ హఠాన్మరణంపై ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఇటు కార్మిక సమాజానికి అటు న్యాయవాద లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాండురంగ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఓబీసీ ఉద్యమానికి స్టాలిన్ నాయకత్వం అభినందనీయం

నెహ్రూనగర్: ఓబీసీ కులాల గణంకాల సేకరణ కోరుతూ దేశవ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కీలకపాత్ర పోషించడం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల న్యూఢిల్లీలో కాంగ్రెస్ సహ బీజేపీ యేతర పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించిన స్టాలిన్ ఓబీసీ గణాంకాల్ని సేకరించాల్సిందేనని, లేదంటే అసలు జనాభా గణననే బహిష్కరించాలనే తరహాలో కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేయడం సమంజసమేనని పేర్కొన్నారు. నిజంగా బీజేపీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణం కులాల గణాంకాలు సేకరించడానికి ఉత్తర్వులు జారీ చేయాలని శంకరరావు డిమాండ్ చేశారు.

10న పూలే విగ్రహాల ఏర్పాటుపై సదస్సు



పాత గుంటూరు: వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 10న మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రీబాయి పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుపై సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు సాధన సమితి కన్వీనర్ వై. కోటేశ్వరరావు తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని మున్సిపల్ బంగ్లా సర్కిల్‌లో ఐలాండ్ నిర్మించి, పూలే దంపతుల విగ్రహాలను ఒకే చోట ఆవిష్కరించి పూలే సర్కిల్‌గా నామకరణం చేయాలని కోరుతూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సభ జరుగుతుందని, నగర ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి సభ్యులు దొంతా సురేష్, ఉగ్గం సాంబ శివరావు, బత్తుల వీరాస్వామి, గంటి ప్రభుదాస్, చిరతనగండ్ల వాసు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న క్యాష్ కౌంటర్లు



నెహ్రూనగర్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్తి పన్ను ఏక మొత్తంలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. పన్ను చెల్లించేందుకు గానూ నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లోనూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుసుకోవాలని ఆమె సూచించారు. డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్‌మెంట్ నంబర్‌తో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి, పన్ను చెల్లించి రాయితీ పొందాలని సూచించారు.

రాష్ట్ర అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పార్టీ నేతలు

పట్నంబజారు: వైఎస్సార్ వారసత్వం..మనసు నిండా మానవత్వం..కుల, మత, పార్టీ రహిత పాలనతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పశ్చిమ నియోజకవర్గం 32వ డివిజన్‌లో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి ప్రారంభించారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ నేతృత్వంలో బ్రాడీపేటలోని పలు అపార్ట్‌మెంట్లలో ప్రచారం చేశారు. స్వయంగా ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి ప్రభుత్వ పని తీరు, గత ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి గల తేడాను అడిగి తెలుసుకున్నారు. పార్టీ స్టిక్కర్లను వారి అనుమతితో ప్రతి ఇంటికీ అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్తు' అనేది పార్టీ కార్యక్రమంలా కాకుండా జనం గుండె చప్పుడుగా మారిందని తెలిపారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనేది కూడా ప్రజల నుంచి పుట్టిన నినాదం మాత్రమే కాదనీ.. సీఎం జగన్‌పై చెక్కుచెదరని ప్రజల ప్రగాఢ విశ్వాసానికి ప్రతీక అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది పార్టీ సైనికులు 14 రోజుల్లో కోటి 60 లక్షల కుటుంబాల్ని కలిసే బృహత్తర కార్యక్రమమే 'జగనన్నే మా భవిష్యత్తు' అని వివరించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ పూర్తి సానుకూల వాతావరణంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని తమ నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. గడపగడపకు కార్యక్రమానికి మించి ఈ కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సచివాలయాల వ్యవస్థపై ప్రజల్లో స్పందన బాగుందని తెలిపారు. తాము అడుగుతున్న ప్రశ్నలకు, ప్రజలు ఇస్తున్న సమాధానాల్లో జగనన్న ప్రభుత్వంపై వారికి పెరిగిన సంపూర్ణ విశ్వాసం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో 20వ తేదీ వరకు ఒక మహా యజ్ఞంలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రజలందరితో మమేకం అవుతామని వివరించారు. ఇంకా ప్రజల అవసరాలు ఏమైనా ఉంటే వాటిని కూడా తెలుసుకుని తీర్చేందుకు దీన్నొక చక్కని వేదికగా మలచుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ కన్వీనర్లు డేవిడ్, పాపారావు, శ్రీనివాసరెడ్డి, రసూల్ జాని, విజయమ్మ, శ్యాంసుందర్, గృహసారథులు వలివేటి వెంకటరమణ, ఖాసిం, నాగార్జున, పార్టీ నేతలు అరవ తిమ్మరాజు, నెరుసు శ్రీనివాసరావు, మాదాసు కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, తాడేపల్లి విజయకృష్ణ, మేరిగ విజయలక్ష్మి, విజయమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో....

నియోజకవర్గంలోని 49 డివిజన్ వేళంగణీనగర్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరి మాట్లాడుతూ గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని ఇంటిని సందర్శించాలని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధిని వివరించాలని చెప్పారు. గడప గడపకూ వెళ్లి ఇంట్లోని అవ్వతాతల నుంచి చిన్నారుల వరకు సీఎం వై.ఎస్. జగన్ వారికి చేస్తున్న మంచిని వివరించాలని తెలిపారు. యజమాని అనుమతితో ఆ ఇంటి గోడకు స్టిక్కర్ అంటించడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరించాలని సూచించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు షేక్ ఆసీఫ్ మాట్లాడుతూ 14 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్ని దిగ్విజయంగా నిర్వహించాలని చెప్పారు. విషం చిమ్ముతున్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి, పార్టీ నేతలు ఎక్కలూరి మారుతి, కిశోర్, కోటిలింగారెడ్డి, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు గనిక ఝాన్సీరాణి, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శుభ శుక్రవారం



ట్రినిటీ లూథరన్ చర్చిలో సందేశమిస్తున్న రెవరెండ్ దైవాశీర్వాదం



తెలుగు బాప్టిస్ట్ సంఘంలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ కిశోర్



వెస్ట్ ప్యారిష్ చర్చిలో సందేశమిస్తున్న రెవరెండ్ చార్లెస్



వెస్ట్ ప్యారిష్ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

పాత గుంటూరు: క్రైస్తవుల పవిత్ర దినమైన గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం)ను నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ఈస్ట్ ప్యారిష్, నార్త్ ప్యారిష్ చర్చిలలో విచారణ గురువులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. సర్వలోక ప్రజల పాప క్షమాపణ, రక్షణ కోసం యేసుక్రీస్తు ప్రభువు కల్వరి కొండపై శిలువ శ్రమను అనుభవించి మరణించారని వివరించారు. విశేష సంఖ్యలో విశ్వాసులు ఆరాధనలో పాల్గొని, యేసు ప్రభువును ఆరాధించారు. యేసు శిలువలో పలికిన ఏడు మాటల ఆవశ్యకత, ప్రాముఖ్యతను పాస్టర్లు వివరించారు. ఆనందపేటలోని సమాధుల తోటలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి తమ పెద్దల్ని స్మరించుకున్నారు.

■ కొత్తపేట కుగ్లర్ హాస్పిటల్ ప్రాంగణంలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో ఘనంగా ఆరాధనలు జరిగాయి. రెవరెండ్ జె. దైవాశీర్వాదం, రెవరెండ్ వి. క్రిష్టఫర్ ప్రజల రక్షణార్థం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బి. సుదర్శన్ భీమ్‌రాజు, బి. లెనిన్, బి. విల్సన్ రాజు, బి. ఆంథోనమ్మ, వై. వినోద్ పాల్గొన్నారు.

■ నగరంపాలెంలోని వెస్ట్ ప్యారిష్ చర్చిలో తూర్పు, పశ్చిమ సంఘ కాపరులు ఆరాధన చేశారు. జె. సాగరిక ప్రదీప్, డాక్టర్. డి. సౌమ్య నెల్సన్ బైబిల్ పఠనం చేశారు. రెవరెండ్ సీహెచ్. మాణిక్యరావు ప్రార్థన, రెవరెండ్ డాక్టర్ డి. జేసుదానం ఉపోద్ఘాతం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, విశ్వాసులు పాల్గొన్నారు.

■ కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్టు సంఘంలో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. వర్తమానికులు కిశోర్, దానియేల్, బి. ప్రతాప్, జి. హెలెన్ రూత్, జి. మధు, నవీన్‌కుమార్, వి. దాసుబాబు పాల్గొని సందేశమిచ్చారు.

వివిధ రంగాల్లో ప్రముఖులకు సన్మానం



ప్రొఫెసర్ భవనారి సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఆవోపా సభ్యులు

పాత గుంటూరు: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో శుక్రవారం ప్రతిభకు పట్టాభిషేకం పేరుతో వివిధ రంగాల్లో ఉన్నత పదవులు అధిరోహించిన వారిని సన్మానించారు. సభకు ఆవోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే రామ్ రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకుని సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నవారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఆవోపా సేవలు అభినందనీమన్నారు. అనంతరం గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.కె.సురేష్, డాక్టర్ నీలి ఉమాజ్యోతి, ఉటుకూరి నాగేశ్వరరావు, ఏఎన్‌యూ ప్రొఫెసర్ భవనారి సత్యనారాయణ, ఈఓ పాదర్తి దుర్గారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆవోపా కార్యదర్శి వి.రాధాకృష్ణయ్య, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు, వి.కృష్ణానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు వెస్ట్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక పరివర్తన కూడా కలుగుతుందని ఏపీ యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. శ్రీరామ చంద్ర మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మూడు రోజుల యోగ మహోత్సవ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఖర్చులేని అద్భుతమైన భారతీయ యోగా విధానాల్ని యువత కూడా నేర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, దుర్గారావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై జాషువా సాహితీ సమరం



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



గుర్రం జాషువా సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

పట్నంబజారు: సామాజిక రుగ్మతలపై సాహిత్య సమరం చేసిన మార్గదర్శకుడు గుర్రం జాషువా అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం పాత గుంటూరు క్రైస్తవ సమాధుల తోటలో ఆయన సమాధికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అడుగడుగునా తపించి వారి ఉద్ధరణకు తన కలంతో గళం విప్పిన మహనీయుడని జాషువా అని కొనియాడారు. కనీస భావ వ్యక్తీకరణకు కూడా నోచుకోని లక్షలాది బడుగు జీవుల గొంతుకై, భువన భోంతరాళాలు ప్రతిధ్వనించేలా గర్జించిన ఆయన చరితార్థుడని తెలిపారు. చివరి వరకు నమ్మిన సిద్ధాంతాన్ని వీడక, ఆధునిక భావాలతో జీవనం కొనసాగించిన జాషువా జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. జన హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న జాషువా అసమాన ప్రతిభావంతుడు, అమరుడని కొనియాడారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం పాత గుంటూరు క్రైస్తవ సమాధుల తోటలో మహాకవి, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా సమాధి వద్ద తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, మహిళా నేత నూరి ఫాతిమా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వాసులు అధిక సంఖ్యలో తరలి వస్తున్న క్రమంలో వారి కోసం మజ్జిగ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ మీరావలి, ధూపాటి వంశీ, పూనూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, సాల్మాన్, అనిల్‌కుమార్, జాన్‌బాబు, కుర్రా పున్నారావు, స్వర్ణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఏఎన్‌యూ పూర్వ విద్యార్థుల కృషి

ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందం



సహచర పూర్వ విద్యార్థులతో సత్యానందం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు పూర్వ విద్యార్థులుగా తమ వంతు కృషి చేస్తున్నామని ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత జాయింట్ కమిషనర్, ఏఎన్‌యూ పూర్వ విద్యార్థి తెలగరెడ్డి సత్యానందం పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో 1978–80, 1979–81 బ్యాచ్‌లలో ఎంకాం, ఎంబీఏ చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ 42 ఏళ్ల తరువాత గత నెల 18న కలుసుకున్నామని చెప్పారు. కాగా గత సమావేశానికి హాజరు కాలేకపోయిన పూర్వ విద్యార్థుల్లో పలువురు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సమావేశమయ్యారని వివరించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ విద్యాభివృద్ధిలో పూర్వ విద్యార్థులుగా తమ వంతు సహాయ, సహకారాల్ని అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏఎన్‌యూ ఎంకాం, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై మార్గదర్శనంతో పాటు పేద విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, పలు కార్యక్రమాల్ని చేపట్టేందుకు నిర్ణయాల్ని తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు జి. ప్రసాద్, జి.ఎస్. బ్రహ్మానందం పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

నెహ్రూనగర్: సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యమని ఓసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జి. గోవిందరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమంతో పాటు అగ్రవర్ణ పేదల్ని కూడా ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు.రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా కూడా అమలు కావడంలేదని చెప్పారు. పలు రాష్ట్రాల్లో జగనన్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వై.ఎస్. జగన్ ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పాత గుంటూరు: రింగు రోడ్డు రాజేంద్రనగర్‌లోని శుభం గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ మహిళలను ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు ప్రవీణకుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాల్ని ప్రదర్శనలో ఉంచామని పేర్కొన్నారు. ముంబాయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డిజైనర్లతో నగర ప్రజలకు లేటెస్ట్ డిజైన్‌లను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 9వ తేదీ వరకు ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పాత గుంటూరు: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు పాటిస్తున్నారు. కఠోర ఉపవాస దీక్షలు 15 రోజులు పూర్తయ్యాయి. రంజాన్ మాసంలోని మూడో శుక్రవారం ముస్లింలు విశేష సంఖ్యలో పాల్గొని మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. సాధారణ రోజుల్లో ఐదు పూటలా చేసే నమాజుకు అదనంగా రాత్రిపూట తరావీహ్ అనే ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. దాదాపు మూడు గంటల పాటు సాగే ఈ ప్రార్థనలో దివ్య గ్రంథం ఖురాన్‌ను ఇమాం వినిపిస్తారు. విభాగాలుగా విభజించి నిత్యం కొంత భాగం చెబుతున్నారు. నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీక్షలు, ప్రార్థనలు, దానధర్మాలతో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకునే ముస్లింల అతి పెద్ద పండుగకు మరో పదిహేను రోజులే మిగిలివుంది. ఇప్పటికే నగరంలో ప్రధానంగా తూర్పు నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది.

న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడిన సీఎం జగన్

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్



పట్నంబజారు: న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ పాదయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న సీఎం వై.ఎస్. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక కార్యక్రమాల్ని చేపట్టారని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ. 100 కోట్లు కేటాయించడంతో పాటు వృత్తిని నమ్ముకుని వచ్చిన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ కింద రూ 5వేలు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. న్యాయవాద రంగంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చిత్తశుద్ధితో మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం జరిగేలా జీపీలు, పీపీలు, ఏపీపీలు వంటి ఎన్నో పదవులను అందజేశారని వివరించారు. ఈ క్రమంలో శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ప్రాంతీయ కార్యాయలంలో జరిగే '' జగనన్న పాలనలో న్యాయ సంస్కరణలు'' కార్యక్రమానికి జిల్లాలోని న్యాయవాదులు హాజరుకావాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లీగల్ విభాగం ప్రతినిధులు, రాష్ట్ర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న వైద్యులు అంజిత్, వెంకటేష్, యర్రా నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అనుకోని విధంగా సంభవించే కార్డియాక్ అరెస్టును సరైన అవగాహనతో నియంత్రించవచ్చని డాక్టర్ యర్రా నాగేశ్వరరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కమ్మ బాలుర వసతి గృహం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గుండె పోటుకు ప్రథమ చికిత్స అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, డాక్టర్ పి. వెంకటేష్ నమూనాలను ఉపయోగించి కార్డియాక్ అరెస్టు అయిన వ్యక్తుల్ని ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు సీపీఆర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం డాక్టర్ యర్రా నాగేశ్వరరావు మాట్లాడారు. నేడు ప్రతి ఒక్కరు గుండె జబ్బులకు లోనవడం, చిన్న వయసులోనే కార్డియాక్ స్ట్రోక్‌కు గురవుతున్న పరిస్థితుల్లో ప్రాణాల్ని రక్షించేందుకు ఉపయోగపడే సీపీఆర్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఎవరికైనా అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు సంభవించిన సమయంలో పక్కనే ఇటువంటి శిక్షణ పొందిన వారుంటే నిండు ప్రాణాన్ని కాపాడిన వారవుతారని తెలిపారు. విద్యార్థులంతా తాము నేర్చుకోవడమే కాకుండా స్నేహితులకు సైతం నేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ శతాబ్ది ఉత్సవాల కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కోశాధికారి బొల్లేపల్లి శ్రీనివాసరావు, కె. వెంకట్రావు పాల్గొన్నారు.

20న సివిల్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 20న ఆన్‌లైన్ ద్వారా ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. "ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో సివిల్స్ అధికారుల్ని దేశానికి అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఈనెల 23న మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డుల్ని ప్రదానం చేస్తామని వెల్లడించారు. పరీక్ష సిలబస్, రిజిస్ట్రేషన్ వివరాలకు 8686233879 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నల్లపాడులో రాజన్న చలివేంద్రం ప్రారంభం

గుంటూరు రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో రాజన్న చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం సంతోషకరమని సమాజ చైతన్య సంఘం అధ్యక్షుడు పరిశుద్ధరావు తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సంఘం ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ, రాజన్న చలివేంద్రం ప్రారంభించారు.